క్లుప్తంగా

క్లాప్‌మిత్రలకు వైద్య పరీక్షలు

బెల్లంకొండ: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని క్లాప్‌మిత్రలకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. చంద్రరాజుపాలెం పీహెచ్‌సీలో పరీక్షలు చేయించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వి.శ్రీనివాసనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గిరిరెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏ వీధికెళ్లినా కుక్కల గుంపులే..



సత్తెనపల్లి: పట్టణంలో ఏ వార్డులో చూసిన కుక్కలు భౌ .. భౌ .. అంటూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ఏ వీధికెళ్లినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళన కలిగిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు ఇటీవల వీధి కుక్కలు పట్టే కార్యక్రమాన్ని చేస్తున్నారు. గురువారం పట్టణం లోని మార్కెట్ సెంటర్‌లో వీధికుక్కలు గుంపుగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడికి ప్రయత్నిస్తూ పరుగులు తీశాయి.

సాగర్‌బాబును ఆదుకోండి



నకరికల్లు: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వికలాంగునిగా మారి మంచానపడిన సాగర్‌బాబును ఆదుకోవాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. సాగర్‌బాబును ఆదుకోవాలంటూ మండలంలోని చేజర్లలో చేపడుతున్న నిరశన దీక్ష గురువారం ఆరో రోజుకు చేరుకుంది. గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులు ఎల్‌సి తీసుకొని విద్యుత్ సరఫరా నిలిపివేయకపోవడంతో మరమ్మతులు చేస్తున్న కార్మికుడు సాగర్‌బాబు విద్యుత్‌షాక్‌కు గురై జీవచ్ఛవంలో మారాడన్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితుడిని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, గిరిజనసంఘం, పీడీఎం, సీపీఎం, సీపీఐ, పీకేఎం, గిరిజనసంఘం నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, వి.కోటానాయక్, జి.పిచ్చారావు, బాణావతు దుర్గాబాయి, కొండానాయక్, ఆంజనేయులునాయక్, మణికంఠ, రాణి, శ్రీనునాయక్, కేసానుపల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇబ్బంది లేకుండా యూరియా అందించండి



పెదకూరపాడు: రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులు కోరారు. మండలంలో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ అధికారులు సమాధానం ఇచ్చారు. శాఖల వారీగా అధికారుల పనితీరుపై సమీక్షించారు. విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ చర్యలను తీసుకోవాలని, వ్యాధులు బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి



సత్తెనపల్లి: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఉదయరాజు అన్నారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్, మత్తు పదార్థాల వినియోగం విరమణపై అవగాహన కార్యక్రమం పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఉదయరాజు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. ఎయిడ్స్ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కలిగించారు. మాదక ద్రవ్యాల వినియోగం, హెచ్ఐవీపై పోరాటంలో యువత పాత్ర చాల ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, యుక్తవయసులో పరిణామాలు, యవ్వనంలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. ఆర్ట్‌బ్లూస్ నాగలక్ష్మి, ఈశ్వర్ మాట్లాడారు. పీఈలు సుజాత, శాంతకుమారి, రమాదేవి, ప్రసన్న, లక్ష్మీబాయి, ఎస్తేరు, నాగూర్‌బాషా, విజయకుమారి పాల్గొన్నారు.

నిరుపయోగంగా కియోస్క్‌లు

- రైతు సేవాకేంద్రాల్లో మూలనపడ్డ యంత్రాలు
- నిలిచిన సేవలు

అమరావతి: రైతు సేవాకేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారి మూలనపడ్డాయి. నాడు భూసార పరీక్షల నుంచి దిగుబడుల కొనుగోలు వరకు అన్నదాతలకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో అత్యధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే కియోస్క్ యంత్రాలను అమర్చారు. జగనన్న పాలనలో ఐదేళ్లపాటు రైతులు గ్రామంలోనే నాణ్యమైన విత్తనాలు, సరసమైన ధరలకు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశారు. పంటలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వివిధ మార్కెట్లలో ధరలు, వాతావరణం వివరాలను తెలుసుకునేందుకు కియోస్క్‌ను రైతులు స్వయంగా ఉపయోగించే పరిస్థితి ఉండేది.

ప్రశ్నార్థకంగా..

ప్రస్తుతం కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారు. వాటికి విత్తనాలు, ఎరువులు, మందుల కేటాయింపు, భూసార పరీక్షలు రైతులకు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో రైతులకు మళ్లీ పాతకాలం నాటి అవస్థలు మొదలయ్యాయి. అన్నదాతకు మరింత ప్రోత్సాహం అందించాలని నాడు జగనన్న ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తే నేడు కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసి వాటి మనుగడను ప్రశ్నార్థకంగా మార్చింది.

నాడు 71 ఆర్బీకేలు

రైతన్నకు నాడు జగన్ ప్రభుత్వం భరోసా ఇచ్చింది.



రైతు సేవాకేంద్రంలో నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

పెదకూరపాడు నియోజకవర్గంలో 71 ఆర్బీకేల ఏర్పాటుకు రూ.21.8 లక్షల చొప్పున మొత్తం రూ.15.47 కోట్లు ఖర్చు చేసింది. 71 ఆర్బీకేల్లో ఒక్కొక్కటి.. రూ.70వేల చొప్పున మొత్తం రూ.49.70 లక్షలతో కియోస్క్‌లను అమర్చారు. ఇవి పంటలకు కావాల్సిన సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం, తమ సమీపంలోని మార్కె ట్లలో పంటల ధరలు, ఎరువుల బుకింగ్ సొంతంగా చేసుకునేందుకు ఈ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

ఫోన్లోనే సమాచారమిస్తున్నాం

> కియోస్క్‌లు పనిచేస్తున్నాయి. రైతుసేవా కేంద్రాలు మారుమూల గ్రామాల్లో ఉండటంతో సక్రమంగా ఇంటర్‌నెట్ సౌకర్యం అందడం లేదు. ఫోన్లోనే రైతులకు కావాల్సిన సమాచారం ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రైతులను అప్రమత్తం చేస్తూ వారు అడిగిన వాటికి సమాచారం అందిస్తున్నాం.
>
> –ఎస్‌కేఎఫ్ అహ్మద్, మండల వ్యవసాయాధికారి

నేడు సేవలు సున్నా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో పాటు భూసార పరీక్షలకు మంగళం పలికారు. అనంతరం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి గతంలో అమలులో ఉన్న సేవలను నిలిపివేసింది. దీంతో రైతులు ఈ కేంద్రాలకు రావడం మానేశారు.

అందుబాటులో ఉంటే..

లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు మూలనపడి నిరుపయోగంగా మారాయి. యూరియా అందుబాటులో లేక రైతులు రోజుల తరబడి దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి కలిగింది. కియోస్క్‌లు అందుబాటులో ఉంటే రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు గురించి తెలుసు కోవడమే గాకుండా పండించిన పంటల ధరలు, గిట్టుబాటు ధరలను తెలుసుకునే వీలుండేది. వాతావరణం సమాచారంతోపాటు ఏ సీజన్లో ఏ పంటలు సాగు చేయాలో తెలుస్తుండేది.

‘ముప్పాళ్ల’లో మూడో విడత రీ సర్వే

డివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ విజయ్‌కుమార్



గోళ్ళపాడు గ్రామ సచివాలయంలో రీసర్వేపై సమీక్షిస్తున్న అధికారులు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలో మూడో విడత రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల గుర్తింపు జరుగుతున్నట్లు డివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ విజయ్‌కుమార్ చెప్పారు. గోళ్ళపాడులో రెండో విడతలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియపై సర్వే సిబ్బందితో గురువారం సమీక్షించారు. రీసర్వేలో భాగంగా ప్రస్తుతం రైతులకు అభ్యంతరాలపై నోటీసులు అందించామని చెప్పారు.1,050 మంది రైతులు భూముల రికార్డులను సర్వే సిబ్బందికి అందించారని, మిగిలిన వారి నుంచి భూముల కొలతలపై అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చన్నారు. ఇప్పటి వరకు పూర్తైన సర్వే రికార్డుల వివరాలను పరిశీలించారు.

మండలంలో మిగిలిన తొండపి, ముప్పాళ్ళ, దమ్మాలపాడు, మాదల గ్రామాల్లోను మూడో విడత రీసర్వే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఆయా గ్రామాల్లో హద్దులను గుర్తించామని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. గోళ్ళపాడులో పట్టా సబ్‌డివిజన్ కోసం రైతు అందించిన అర్జీని పరిశీలించారు. మండల సర్వేయర్ ఎం.రాజు, వీఆర్వో బి.దాసు, విలేజ్ సర్వేయర్ నాగుల్‌మీరా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్లు, లెక్చరర్లు

సత్తెనపల్లి: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని విద్యాకేంద్రం జూనియర్ కాలేజ్ అండ్ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకట్రావు చెప్పారు. పట్టణంలోని విద్యా కేంద్రం జూనియర్ కాలేజ్ ఆధ్వర్యాన సత్తెనపల్లి మండలం నందిగామ జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ –19 ఫుట్‌బాల్, సెపక్‌తక్రా ఎంపికల్లో విద్యాకేంద్రం జూనియర్ కాలేజీకి సంబంధించిన క్రీడాకారులు 11 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని గురువారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఇప్పుడు ఏ విధంగా అయితే ఎంపికయ్యారో ఈనెల 22 నుంచి 24 వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి విజయం సాధించాలని ఖ్యాతిగడించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలవాలని కొనియాడారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ అండర్ – 19 బాలుర జట్టుకు ఎంపికైన పి.నాగ సాయి, కె.బన్ను, పి.నవీన్, పి.తేజ, షేక్ సోహెల్ తన్వీర్, షేక్ మహమ్మద్ ఇర్ఫాన్‌ను అభినందించారు. ఫుట్‌బాల్ అండర్ –19 బాలికల జట్టుకు ఎంపికైన జి.సౌజన్య, డి.ప్రవల్లిక, కె.స్నేహలత, సెపక్ తక్రా అండర్ –19 బాలుర జట్టుకు ఎంపికైన వై.ప్రభుదాసు, పి.నవీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నిమ్మగడ్డ చిట్టిబాబు, నంబూరి నరసింహారావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ మౌలాలి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, పీడీ పుచ్చకాయల శివరామకృష్ణ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



బలుసుపాడులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని 75 తాళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెలుగొండ రెడ్డి అన్నారు. బలుసుపాడు గ్రామ సచివాలయంలో స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్, టీబీ, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లమేకల సాంబశివరావు, వైద్యులు ఆదిత్య, అమరావతి వైద్యాధికారి ఎస్.మౌనిక, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: స్థానికప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథి ఎంపీపీ పెరుమాళ్ళ కోటయ్య , టీడీపీ నాయకులు కాంద్రుకాశియ్య వైద్య శిబిరం ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ షాద్, డాక్టర్ బాలఅంకమ్మబాయి, సర్పంచ్ మల్లా చందమామ తదితరులు పాల్గొన్నారు.

అంచులవారి పాలెంలో..

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ సందర్భంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రవితేజనాయక్, డాక్టర్ పాల్‌రవి 245 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దీపిక

చంద్రరాజుపాలెం(బెల్లంకొండ): మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు దీపికా మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఓర్పు రంగారావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, పట్టణాన్ని స్వచ్ఛ సత్తెనపల్లిగా తీర్చిదిద్దడానికి ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్ –2025 నినాదంతో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం నుంచి గార్లపాడు రోడ్, గాంధీ బొమ్మల రోడ్, రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా తాలూకా సెంటర్ వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో ర్యాలీ నిర్వహించారు. తాలూకా సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దని, సింగిల్ యూజ్ పాలిథిన్ (కవర్లు) నిషేధించడంతో చిన్న, పెద్ద వ్యాపారస్తులు, ప్రజలందరూ వాటిని ఉపయోగించకూడదన్నారు. దీనిపై మైక్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రిలు, మెప్మా టీఎంసీ, సీఓలు, స్వయం సహాయక సంఘ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో స్వచ్ఛ ఉత్సవ్ ర్యాలీ చేస్తున్న మహిళలు

ముప్పాళ్ళ: ముప్పాళ్ళలో స్వచ్ఛత హి సేవ అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఎంపీడీవో కార్యాలయం నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ చేశారు. ఎంపీడీవో రత్నం మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని చెప్పారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావు, ఏపీఓ ఏడుకొండలు, ఎమ్మార్సీ బ్రహ్మానందం, పీడీ సుభాని పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే నంబూరు జన్మదిన వేడుకలు



నంబూరు శంకరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు



నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కోసిన శంకరరావు

పెదకూరపాడు: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నంబూరు శంకరరావు జన్మదిన వేడుకలు గురువారం పెదకూరపాడు నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నేతలు శంకరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తల సమక్షంలో భారీ కేకును కట్ చేశారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు తూర్పు సమన్వయకర్త నూరి ఫాతిమా, పలువురు మహిళా నాయకులు నంబూరు శంకరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నంబూరు శంకరరావు కోరారు. పలు మండలాల ప్రజలు భారీ గజమాలతో శంకరరావును సత్కరించారు.

అమరావతి: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో నంబూరు జన్మదిన వేడుకలు నిర్వహించారు. తొలుత అమరావతి శ్రీబాలచాముండికాసమేత అమరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దార్ల అజయ్, నిబద్దిల ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివరావు, పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆర్ఎంపీల విభాగం అధ్యక్షుడు షేక్ షరీఫ్, ఎండ్రాయి సర్పంచ్ నాయుడు రాంబాబు, నరుకుళ్ళపాడు ఉపసర్పంచ్ నల్లిబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక ఎస్సీ కాలనీలోనంబూరు శంకరరావు జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివిస్ట్ కార్యదర్శి సందెపోగు పున్నారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నేతలు సందెపోగు సంసోను, సందెపోగు నాగేశ్వరరావు, ఎస్.జోజి, రోశయ్య, వాసు, ఏసోబు, తాళ్లూరి బిక్షం, కనకరత్నం, ఇంటూరి నాగేశ్వరరావు, కె.రోజా, సందెపోగు లక్ష్మణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

– మాదిపాడు, అచ్చంపేట, తాళ్లచెరువు, కోనూరు, చిగురుపాడు, కోగంటివారిపాలెం, రుద్రవరం, కొండూరు, పెదపాలెం, చామర్రు, అంబడిపూడి, కస్తల తదితర గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు ప్రత్యేక వాహనాల్లో వెళ్లి నంబూరు శంకరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

వేర్వేరు క్రీడలకు పలువురు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాలుర బాక్సింగ్ పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎం.శివసాయిశ్రీకర్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెయింటాన్స్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–19 బాలుర బాక్సింగ్ పోటీలో శివసాయిశ్రీకర్ 64–69 కేజీల విభాగంలో ప్రథమస్థానంలో నిలచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీ లో శ్రీకర్ ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తాడని తెలిపారు. శ్రీకర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి తదితరులు అభినందించారు.

అథ్లెటిక్స్ మీట్‌కు .

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ మీట్‌కు వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు, పీడీ రాయల ఆంజనేయులు గురువారం తెలిపారు. గుంటూరుజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 17వతేదీన నిర్వహించిన ఉమ్మడి గుంటూరుజిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు బాల బాలికల విభాగంలో ప్రతిభ కనపరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు.

బాలికల విభాగంలో ఆవుల భూమిక (రన్నింగ్), పసుపులేటి తిరపతమ్మ, పిన్నెబోయిన స్రవంతి (షాట్‌పట్), బాలు ర విభాగంలో కొప్పుకొండ వెంకట వసంతచరణ్ (జావలిన్), బూదాల చైతన్య (హైజంప్), జి.శ్రీనివాస్ (రన్నింగ్), డి.త్రినాథ్ (షాట్‌పట్), ధర్మవరపు శివాజీ (రన్నింగ్) ఎంపికైనట్టు వివరించారు.

డిజిటల్ టెక్నాలజీపై అవగాహన

రాజుపాలెం: డిజిటల్ టెక్నాలజీతో నాణ్యమైన ఆర్థిక డిజిటల్ పేమెంట్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని గణపవరం చైతన్యబ్యాంక్ మేనేజర్ లక్ష్మీకుమార్ తెలిపారు. బలిజేపల్లిలో దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన సమావేశం జరిగింది. డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు శివరంజని, వెలుగు సీసీ కోటమ్మ, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజుపాలెం: అనుపాలెం జెడ్పీ పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గి అమూల్య డిమాండ్ చేశారు. మండలంలోని అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలను ఎస్ఎఫ్ఐ సభ్యుల బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని హెచ్ఎం శైలజకు అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మణికంఠరెడ్డి, వెంకటరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

సత్తెనపల్లి: వృద్ధుడు అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన 62 ఏళ్ల వృద్ధుడు చెరుకూరి రాజశేఖర్ ఈ నెల 25న రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా సమాచారం లభించలేదు. ఆయన భార్య చెరుకూరి సుధ గురువారం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే సత్తెనపల్లి రూరల్ సీఐ 9440796231, సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ 08641–232033 నంబర్లలో తెలపాలని సూచించారు.


పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెదకూరపాడు: కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని పెదకూరపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ పెదహిమాంబి అన్నారు. పెదకూరపాడులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు పోషికాహారంపై ఆహారంపై, ఊబకాయ నివారణపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం ఎంపీడీవోగా శ్రీనివాసరావు

రాజుపాలెం: మండలపరిషత్ కార్యాలయ ఎంపీడీవోగా వి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు నకరికల్లు మండలం ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తుండగా ప్రమోషన్‌పై రాజుపాలెం ఎంపీడీవోగా వచ్చారు.

యూరియాను వినియోగించుకోండి



నకరికల్లు: యూరియాను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చాగల్లు, కుండ్లకుంట, చీమలమర్రి, చేజర్ల గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాల ద్వారా గురువారం రైతులకు యూరియా, డీఏపీ ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా 59.28 టన్నుల యూరియా, 5 టన్నుల డీఏపీ ఎరువులు రైతులకు పంపిణీ చేశామన్నారు. నాలుగు గ్రామాల్లోని మొత్తం 520 మందికి ఎరువులు అందాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు జంపని రామాంజనేయులు, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

పీసపాడు (క్రోసూరు): రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని ఏవో వేణుగోపాల్ గురువారం తెలిపారు. మండలంలోని హసనాబాద్ పీసపాడు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీని మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షించారు.

ప్రభుత్వ తీరుతో సంక్షోభంలో విద్యారంగం



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

సత్తెనపల్లి: వివిధ రకాల ప్రయోగాలతో ప్రభుత్వ పాఠశాల, విద్యారంగాన్ని ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టివేసిందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ మలినేని హనుమంతురావు ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ యూటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రణభేరి గురువారం చిలకలూరిపేట, నరసరావుపేట, నకరికల్లు, పిడుగురాళ్లలో నిర్వహించి సత్తెనపల్లి చేరుకుంది. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో ఆయన మాట్లాడారు. హనుమంతురావు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. యుటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా ఆర్థిక ప్రయోజనాలు నెరవేర్చలేదన్నారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు ప్రసంగించారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కిషోర్, సంఘ మండల శాఖ అధ్యక్షుడు పాలెపోగు రమేష్‌బాబు, ప్రధానకార్యదర్శి నంబుల విష్ణు మాట్లాడారు. సంఘ నేతలు ప్రేమ్‌కుమార్, శేషగిరి, వెంకట్రావు, ఠాగూర్, శేషిరెడ్డి, బాలశౌరిరెడ్డి, బాషా, వైఎస్సార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నకరికల్లు: బోధనేతర పనుల భారం తగ్గించాలని పల్నాడు జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు కల్లి శ్రీనివాస రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రణభేరిలో భాగంగా గురువారం నకరికల్లులోని ఉన్నత పాఠశాలకు చేరుకొని ప్రదర్శన నిర్వహించారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దుకూరి మోహన్‌రావు, రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఐక్య ఉపాధ్యాయ సంపాదకులు కుమార్‌రాజా, నకరికల్లు మండల అధ్యక్షులు షేక్ మహ బూబ్‌బాషా, గౌరవ అధ్యక్షుడు పి.యోనా తదితరులు పాల్గొన్నారు.